# రైతులకు అండగా ప్రభుత్వం

గన్నవరం: మిచాంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పంట చేతికి వచ్చే సమయంలో తుపాను రైతులకు తీవ్ర నష్టం కలిగించడం బాధకరమన్నారు. తుపాను వల్ల నీటి మునిగిన పంట పొలాలను ఎప్పటికప్పుడు వ్యవసాయ, రెవెన్యూ శాఖలతో సమీక్షిస్తూ వివరాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు న్యాయం చేసే విధంగా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పంటలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారని వెల్లడించారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం ప్రతీ రైతుకు న్యాయం చేస్తుందని ఎమ్మెల్యే వంశీ వివరించారు.

**అన్నదాతలకు అండగా ప్రభుత్వం**

కంకిపాడు: అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అధైర్యపడొద్దని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. తుపాను ప్రభావంతో గొడవర్రు గ్రామంలో నీట మునిగిన వరి పొలాలు, వరి పనలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా స్నిగ్ధ మాట్లాడుతూ పంట చేతికొచ్చిన తరుణంలో తుపాను రైతులకు నష్టం చేకూర్చడం బాధాకరమని చెప్పారు. ప్రభుత్వం, సీఎం జగనన్న ఎంతో ముందుచూపుతో రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని మిల్లులకు, సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ధాన్యం సేకరణలో నిబంధనలను సడలించి రైతులకు మేలు చేకూరేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఆరబోసుకునేందుకు ఉపాధి హామీ కూలీలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవడం సంతోషకరమన్నారు. పంట నష్టం అంచనాలను సమగ్రంగా రూపొందించి బాధిత రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు గ్రామ రైతులు పాల్గొన్నారు.

**నున్న గ్రామంలో...**

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని ఆర్బీకేలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అధ్యక్షతన సలహా మండలి సమావేశం శుక్రవారం జరిగింది. ఏడీ వెంకటేశ్వరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలోనే ముంపుకు గురైన పొలాలను ఎన్యూమరేషన్ చేయడం జరుగుతుందన్నారు. ఏవో రంగనాథ్ బాబు మాట్లాడుతూ పొలాల్లో నిలిచి వున్న నీరు వెంటనే బయటకు పంపివేయాలని సూచించారు. శాస్త్రవేత్త సుధారాణి, సొసైటీ డైరెక్టర్ ముత్తారెడ్డి, వెటర్నరీ అధికారి ప్రసన్న, ఉద్యాన అధికారి పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు. అనంతరం నున్న, పాతపాడు, రాయనపాడు గ్రామాల్లో పడిపోయిన వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

**హనుమాన్‌జంక్షన్ రూరల్‌లో..**

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక మహాత్మగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ పడకల వీర్రాజు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. పంట నష్టం వివరాలు నమోదు చేయడంతో పాటుగా తడిసిన వరి పనలను, నేలకు ఒరిగిన వరి పంటను ఏవిధంగా సంరక్షించుకోవాలో రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు గంగాభవాని, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, డెప్యూటీ తహసీల్దార్ కె.వెంకటరమణ, ఏవో జొన్నలగడ్డ భవాని, మండల ఉద్యాన అధికారి ఇ.హరిచంద్, ఇరిగేషన్ అసిస్టెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

**పోరంకిలో వ్యవసాయ సలహా మండలి సమావేశం...**

పెనమలూరు: పోరంకి గ్రామంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న సభ్యులు మాట్లాడుతూ పంట చేతికి వచ్చిన దశలో తుపానుతో పంట తడిచి పోయిందని ప్రభుత్వం ముందుకు వచ్చి తడిచిన ధాన్యం గిట్టుబాటు ధరకే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా రైతుల వద్ద ఉన్న ధాన్యం వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏడీఏ సునీల్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే చర్యలు చేపడతామని ధాన్యం మిల్లులకు తరలించే విధంగా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో మండల ఏవో కనకమేడల శైలజ, మండలి సభ్యులు పోలవరపు రవి, శ్రీధర్, విష్ణు, రావిపూడి మోహన్‌రావు పాల్గొన్నారు.

**రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది ..**

గన్నవరం: తుపాను కారణంగా నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కాసరనేని గోపాలరావు తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. కాసరనేని మాట్లాడుతూ తుపాను వల్ల మండల పరిధిలో వరి, వేరుశనగ, ప్రత్తి, పలు వాణిజ్య పంటలకు నష్టం కలిగిందన్నారు. రైతులకు రెండవ పంటలకు అవసరమైన విత్తనాలను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచాలని చెప్పారు. వర్షం నీరు నిలిచిన పొలాల్లో విత్తనాలు మొలకెత్తకుండా ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని ఏవో ఎన్ఎల్.తేజస్వి రైతులకు సూచించారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, డీఆర్‌సీ ఏవో పద్మజా, పలువురు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



గొడవర్రులో ధాన్యం కంకులను పరిశీలిస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ



వరి పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు



పోరంకిలో వ్యవసాయ సలహా మండలి సమావేశంలో పాల్గొన్న సభ్యులు



మాట్లాడుతున్న తేజస్వి, చైర్మన్ కాసరనేని, జెడ్పీటీసీ

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మడిచర్లలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



ప్రొద్దుటూరులో పార్టీ జెండాను ఎగురవేస్తున్న ప్రజాప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ అన్నారు. బాపులపాడు మండలం మడిచర్ల గ్రామ సచివాలయం ప్రాంగణంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. నక్కా గాంధీ మాట్లాడుతూ పేద ప్రజల జీవన స్థితిగతులు మార్చడమే అసలైన అభివృద్ధిగా భావించి సీఎం జగన్ విప్లవాత్మక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. జేసీఎస్ మండల ఇన్‌ఛార్జి ఆవిర్నేని శేషగిరిరావు మాట్లాడుతూ మడిచర్లలో గత నాలుగున్నరేళ్లలో డీబీటీ ద్వారా లబ్ధిదారులకు రూ. 15.89 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా మరో రూ.7.56 కోట్ల మేర నగదు పంపిణీ జరిగిందని వివరించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, పీఏసీఎస్ చైర్మన్ పుట్టా మదన్‌మోహన్, మాజీ సర్పంచ్ చళ్లగోళ్ల సత్యసాయి, జ్ఞానేశ్వరరావు పాల్గొన్నారు.

**జగనన్నతోనే సుస్థిర పాలన సాధ్యం**

కంకిపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సుస్థిర పాలన సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నేతలు సచివాలయాన్ని సందర్శించి, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ప్రధాన సెంటరులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేశారు. అనంతరం ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా బాకీ బాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కొనసాగాలంటే మరలా సీఎం జగన్ అధికారంలోకి రావాలని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి జగనన్నతోనే నెరవేరుతాయని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివనాగలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు బి.సురేష్, పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, నాయకులు భీమవరపు నాగిరెడ్డి, భీమవరపు రాజగోపాల్‌రెడ్డి, బీహెచ్ రమేష్‌రెడ్డి, బీహెచ్ గిరిరెడ్డి, పాలకవర్గ సభ్యులు, ఈవో కూర్మారావు పాల్గొన్నారు.

# సస్యరక్షణ చర్యలతో నష్ట నివారణ సాధ్యం

**కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మంజువాణి**

కంకిపాడు: సస్యరక్షణ చర్యలతో నష్ట నివారణ సాధ్యమవుతుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మంజువాణి అన్నారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో తుపాను ప్రభావంతో పంట నష్టం వాటిల్లిన మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. అరటి, పసుపు, మొదలైన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పంట పొలాల్లో నిలిచిన మురుగునీటిని త్వరితగతిన బయటకు తొలగించాలని తెలిపారు. నీటి పారుదల సౌకర్యం లేకపోతే ఆయిల్ ఇంజిన్లు వినియోగించాలని సూచించారు. మిరప పంటల్లో ఆకుమచ్చ, కాయపుచ్చు రాకుండా ముందు జాగ్రత్తగా కార్బండైజింగ్ లేదా, ప్రొపికొనజోల్ రెండు గ్రాములు లీటరునీటికి కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. పడిపోయిన అరటి చెట్లను చిన్న చిన్న ముక్కలుగా కోసి పొలంలో దున్ని, సింగిల్ సూపర్ ఫాస్ట్ ఒక ఎకరాకు 50 కిలోలు చల్లితే త్వరగా కుళ్లుతుందన్నారు. పాదుల్లో రెండు, మూడు పిలకలను వదులుకుంటే పంట నిలిచి బలంగా ఉన్న పిలకను ఉంచితే లాభదాయకమని వెల్లడించారు. పసుపు తోటల్లో దుంప కుళ్లు రాకుండా మొక్క మొదళ్లో 3 గ్రాములు కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా మెటల్ ఆక్సిల్ లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్లలో ద్రావణాన్ని పోసినట్లయితే దుంప కుళ్లు రాదని వివరించారు. అన్ని పంటలకు 19:19:19 లేదా 13:00:45 మూడు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయటం మంచిదని స్పష్టం చేశారు. దీంతో పాటు సూక్ష్మధాతు మిశ్రమాన్ని ఐదు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే మొక్కలు త్వరగా కోలుకుంటాయన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి జోసఫ్ చందు సుందరం, వీహెచ్‌ఏ అరుణకుమారి, రైతులు పాల్గొన్నారు.



మద్దూరులో అరటితోటను పరిశీలిస్తున్న కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మంజువాణి

**దాతల భాగస్వామ్యం ప్రశంసనీయం**

కంకిపాడు: దాతల భాగస్వామ్యం ప్రశంసనీయమని లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం, విద్యార్థులకు పండ్లు పంపిణీ నిర్వహించారు. రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు దాత బొట్టా సాంబశివారెడ్డి ఐరన్ ర్యాక్‌లను అందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఎం.గోవిందరావు, కె.నాగమల్లేశ్వరరావు, నాగాంజనేయులు, పి.వేణుగోపాల్, పి.కుమారస్వామి, బి.ప్రభాకర్‌రెడ్డి, కె.వెంకటరెడ్డి, వై.నాగయ్య, హెచ్‌ఎం ఏ.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పి.జయమ్మ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



# గన్నవరం నియోజకవర్గంలో 3 రైతు బజార్ల ఏర్పాటు

- రామవరప్పాడులో ఇప్పటికే పనులు ప్రారంభం
- నున్న, ఉంగుటూరు మండలం తేలప్రోలులో త్వరలో టెండర్లు

రామవరప్పాడు: గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ కృషితో నియోజకవర్గంలో 3 రైతు బజార్లు త్వరలో ఏర్పాటు కానున్నాయి. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు, నున్న గ్రామాలతో పాటు ఉంగుటూరు మండలం తేలప్రోలులో రైతు బజార్ల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. రామవరప్పాడు రైవస్ కాలువ వంతెన సమీపంలో తాజాగా ఎమ్మెల్యే వంశీ చేతుల మీదుగా రైతు బజార్ ఏర్పాటుకి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అలాగే నున్న, తేలప్రోలులో రైతు బజార్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించారు. ఈ నెలలోనే టెండర్లు పూర్తి చేసి శంకుస్థాపన చేయనున్నారు.

**రూ 1.9 కోట్లతో...**

రామవరప్పాడులో 40 సెంట్ల స్థలంలో రైతు బజార్ ఏర్పాటు చేసేందుకు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇందుకుగానూ వ్యవసాయ మార్కెట్ శాఖ నుంచి రూ 1.9 కోట్లు మంజూరయ్యాయి. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి జనవరిలో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

**70 దుకాణాలు ఏర్పాటు...**

రైతు బజార్‌లో సుమారు 70 దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. జాయింట్ కలెక్టర్ సమక్షంలో 50 శాతం షాపులకు ఆక్షన్ నిర్వహించి కేటాయిస్తారు. మరో 50 శాతం షాపులను ఎమ్మెల్యే వంశీ సూచన మేరకు నియోజకవర్గంలోని రైతులకు నామమాత్రపు అద్దెతో కేటాయించనున్నారు.



రైతు బజార్ ఏర్పాటుకు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వంశీమోహన్ (ఫైల్)

**2లక్షల మందికి లబ్ధి...**

రైతుబజార్‌తో సుమారు 2లక్షల మంది ప్రజలు లబ్ధి పొందనున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తొలిసారిగా మండలంలో రైతుబజార్ ఏర్పాటు కానుంది. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాలతో పాటు కొరెస్సీనగర్, గుణదల ప్రాంతాలవారికి రైతుబజార్ ఎంతగానో ఉపయోగపడనుంది.

**జనవరిలో అందుబాటులోకి...**



రామవరప్పాడులో ఏర్పాటు కానున్న రైతు బజార్‌ను జనవరి చివరి నాటికి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. రామవరప్పాడుతో పాటు చుట్టు పక్కల గ్రామాల కల జగనన్న ప్రభుత్వంలో ఎమ్మెల్యే వంశీమోహన్ చొరవతో సాకారమవుతోంది. మరో రెండు రైతు బజార్ల ఏర్పాటుకు ఈ నెలలోనే టెండర్లు పిలవడానికి సన్నాహాలు చేస్తున్నాం.

అంజనీకుమారి,
గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్

## కానూరు వద్ద రహదారిపై మురుగునీరు

పెనమలూరు: కానూరు వద్ద విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపైకి మురుగునీరు వచ్చి చేరుతోంది. రహదారిపై పెద్ద ఎత్తున మురుగునీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. తుపాను కారణంగా మురుగునీరు రోడ్డుపైకి చేరి మూడు రోజులు గడుస్తున్నా ఇంతవరకు అధికారులు చర్యలు తీసుకోలేదు. ఎన్‌హెచ్‌ఐ అధికారులు జాతీయ రహదారి పరిరక్షణ విషయంలో ఏమాత్రం స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు తాడిగడప మున్సిపాలిటీ అధికారులు కూడా తమకు సంబంధం లేని విధంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి జాతీయ రహదారిపై ఉన్న మురుగునీరు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కానూరు వద్ద జాతీయ రహదారిపై ఉన్న మురుగు నీరు

**■ 21న చెకుముఖి సైన్స్ పోటీలు**

గన్నవరం రూరల్: చెకుముఖి మండల స్థాయి సైన్స్ పోటీలు ఈ నెల 21న గన్నవరం స్రవంతి హైస్కూల్‌లో జరుగుతాయని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి షేక్ ఇమాం శుక్రవారం తెలిపారు. 21న ఉదయం 10గంటలకు హెచ్ఎంలు సర్టిఫై చేసిన లెటర్‌తో విద్యార్థులు రావాలన్నారు. గన్నవరం, ఉంగుటూరు మండలాల విద్యార్థినీ, విద్యార్థులు ఉదయం 10గంటలలోపు హాజరు కావాలని చెప్పారు. పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాఠశాల టీంగా మండల స్థాయిలో పాల్గొనాలని పేర్కొన్నారు.

**■ వ్యక్తిపై దాడి**

పెనమలూరు: యనమలకుదురులో ఒక వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేయడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం గ్రామంలో శివపార్వతి నగర్ 4వ లైన్‌లో రా.ధాకృష్ణ రెసిడెన్సిలో షేక్ మౌశాలి ఉంటున్నాడు. అతను మెయింటెనెన్స్ సొమ్ము విషయమై అదే భవనంలో ఉంటున్న రమేష్‌ను గురువారం అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య వివాదం తలెత్తగా రమేష్ ఆగ్రహంతో మౌశాలిపై దాడి చేశాడు. బాధితుడు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు, సరఫరా లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు గన్నవరం సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల ఈఈ పి.హరిబాబు శుక్రవారం తెలిపారు. సెక్షన్ పరిధిలోని గన్నవరం, మర్లపాలెం, చిన్నఅవుటపల్లి, దావాజిగూడెం, అల్లాపురం, రాజీవ్‌నగర్, ఎస్టీబీఎల్ కాలనీ, దుర్గాపురం, ఎయిర్‌పోర్ట్ సిటీ, బీబీ.గూడెం, గొల్లనపల్లి, చిక్కవరం ఇండస్ట్రీస్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఆయన పేర్కొన్నారు.

### భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో వేంచేసి ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తికమాసం బహుళ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఎస్.రామాచార్యులు నేతృత్వంలో వ్రతాలను జరిపారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం 58 దంపతులు సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని చేశారు. అలాగే స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో భక్తులు అమ్మవారికి గ్రామ పొంగళ్లు సమర్పించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని మాను(మహాలక్ష్మీ)కి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, భక్తులు పాల్గొన్నారు.

### రామలింగేశ్వరునికి బిల్వార్చన

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో స్వామివారికి శుక్రవారం బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. కార్తిక మాసం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మారేడు దళాలతో స్వామివారికి బిల్వార్చన చేశారు. శ్రీరామలింగేశ్వర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు, ఆలయ దాత సంగా నరసింహారావు దంపతులు, ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్, ఈవో బి.గంగాధరరావు, వెండి, ధన రూపేనా విరాళాలు ఇచ్చిన దాతలు, భక్తులు పాల్గొన్నారు.

### మహిళల ఆర్థిక ఉన్నతికి ప్రభుత్వం తోడ్పాటు



కంకిపాడు: మహిళల ఆర్థిక ఉన్నతికి ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటునందిస్తోందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. డీఆర్‌డీఏ ద్వారా ఉప్పలూరు గ్రామానికి చెందిన డ్వాక్రా సభ్యురాలు లాం హరీషాకు ఉన్నతి పథకం కింద ఆటోను శుక్రవారం అందజేశారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల ఆర్థికాభివృద్ధికి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. డీఆర్‌డీఏ ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు అందించి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తోందని చెప్పారు. జగనన్న సంక్షేమ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి సాధిస్తున్నారని పేర్కొన్నారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, మండల పరిషత్ ఏవో ఉదయ్‌భాస్కర్, దుర్గగుడి బోర్డు మాజీ సభ్యుడు నెరుసు సతీష్, డీఆర్‌డీఏ ఏపీఎం సాంబశివరావు, మాజీ సర్పంచ్ కొణతం గిరిధర్ పాల్గొన్నారు.

### పురందేశ్వరికి సత్కారం



కేసరపల్లి(గన్నవరం): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మండలంలోని కేసరపల్లికి శుక్రవారం విచ్చేశారు. గ్రామంలోని శ్రీహేమ దుర్గా జ్యూయల్ కౌంటీలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్ పొట్లూరి బసవరావు, జ్యూయల్ కౌంటీ చైర్మన్ చలసాని సురేష్, మాజీ వార్డు సభ్యుడు రాజులపాటి శ్రీనివాసరావు దంపతులు పురందేశ్వరిని సత్కరించారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, కార్యవర్గ సభ్యుడు నాదిండ్ల మోహన్, వార్డు సభ్యుడు జాస్తి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

### ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలి

విజయవాడరూరల్: రాష్ట్ర ఎన్నికల సంఘం నియమనిబంధనలను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాటించాలని విజయవాడరూరల్ మండల తహసీల్దార్, సహాయ ఎన్నికల నమోదు అధికారి కె.లక్ష్మి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓట్లు నమోదు, అభ్యంతరాలపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు కొత్తగా ఓట్లు నమోదు చేసుకొనేందుకు, మార్పులు, చేర్పులు చేసుకోవడానికి, మరణించిన వారి ఓట్లు తొలగించడానికి అవకాశం వుందన్నారు. కొత్తగా నమోదు చేసిన ఓట్లు జనవరి 5న వెలువడే ఓటర్ల జాబితాలో వస్తాయని తెలియజేశారు. సమావేశానికి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు శీలం రంగారావు, జడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, ఎంపీటీసీ సభ్యుడు దూరి రత్నం, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవిందునాగబాబు, టిడిపి మండల అధ్యక్షుడు గొడ్డళ్ళ చినరామారావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.

## తేలప్రోలులో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

ఉంగుటూరు: మండలంలోని తేలప్రోలు గ్రామ సచివాలయంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏయే పథకాలు అందుతున్నాయో తెలియజేశారు. ఆయుష్మాన్ భారత్, పీఎంజేవై, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్, అటల్ పెన్షన్ యోజన వంటి పలు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ వడ్లమూడి సరోజిని, సర్పంచ్ లాం దిబోర, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ వింత ఆదినారాయణరెడ్డి(నాని), గ్రామ పార్టీ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో శేషగిరిరావు, ఈవోఆర్డీ బాషా, డాక్టర్ వాణి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## డాబాపై నుంచి పడి వృద్ధురాలి మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: డాబాపై నుంచి ప్రమాదవశాత్తూ కిందకు జారిపడటంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు శుక్రవారం మృతి చెందింది. ఎస్ఐ -2 తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం..బాపులపాడు మండలం కానుమోలుకు చెందిన రెల్లు నాగరత్నం (80) ఈ నెల 7వ తేదీన తన ఇంటి డాబాపై కప్పుపై బట్టలు ఉతుకుతూ ప్రమాదవశాత్తూ కిందకు పడిపోయింది. దీంతో నాగరత్నంకు తీవ్ర గాయాలు కావటంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన చిన్నవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాలకు తరలించారు.అక్కడ చికిత్స పొందుతున్న నాగరత్నం శుక్రవారం సాయంత్రం మృతి చెందింది, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం వీరు మాట్లాడుతూ దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని రకాల తోడ్పాటునందిస్తోందని తెలిపారు. భవిత కేంద్రాలు ఉచిత విద్య, వైద్యం, భోజన సదుపాయలను కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎంపీడీవో ఇ.సత్యకుమార్, ఎంఈఓ కె.రవికుమార్, హైస్కూల్స్ హెచ్ఎంలు ఝాన్సీరాణి, ఎస్.రవీంద్రభవాని, ఝాన్సీ, భవిత కేంద్రం ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, ఎస్.రోజారాణి, ప్రత్యేక ఉపాధ్యాయురాలు సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమలేవుట్ల తొలగింపు

విజయవాడరూరల్: సీఆర్‌డీఏ పరిధిలోని పి.నైనవరం, పాతపాడు గ్రామాల్లో ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా వేసిన అక్రమ లేఔట్లను సీఆర్‌డీఏ అధికారులు శుక్రవారం జేసీబీతో తొలగించారు. ఆయా గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లో అక్రమంగా వేసిన లేఔట్లలో రోడ్లు, సర్వే రాళ్ళను తొలగించారు. వ్యవసాయ భూములను ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రోడ్లను నిర్మించి ప్లాట్లుగా విడగొట్టి అమాయక ప్రజలకు విక్రయించడం వలన ప్రభుత్వానికి భారీగా గండిపడుతుందని అధికారులు తెలియజేశారు. అనధికార లేఔట్లలో ప్లాట్స్ అమ్ముట చట్టరీత్యా నేరమని, అలా చేసిన ఎడల శిక్షార్హులని ఏడీఎం పి.మధుసూదనరావు, జేపీవో బి.ప్రభాకరరావు పేర్కొన్నారు. అక్రమలేట్లను ధ్వంసం చేసిన వారిలో సిబ్బంది గోపి, మాధవరావు వున్నారు.